సిద్దిపేటలో తిరుమల ఆలయాన్ని నిర్మించండి

- టీటీడీ చైర్మన్‌ను కోరిన మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): సిద్దిపేటలో తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయం ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు టీటీడీ చైర్మన్‌ను కోరారు. మంగళవారం తిరుపతి వెళ్లిన హరీశ్‌రావు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని కలిశారు. సిద్దిపేట కోమటి చెరువు ప్రాంతంలో టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వర దేవాలయ నిర్మాణం చేపట్టాలని, ఆలయం కోసం ఇప్పటికే 5ఎకరాల 10 గుంటల స్థలాన్ని మంజూరు చేశామని తెలిపారు. గతంలోనే టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు స్థలాన్ని పరిశీలించి ఆలయ నిర్మాణ నమూనా, డిజైన్స్‌ను రూపొందించినట్టు పేర్కొన్నారు. వచ్చే టీటీడీ బోర్డు మీటింగ్‌లో సిద్దిపేటలో వేంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి ఆమోదం తెలిపి, మీరే నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా రావాలని బీఆర్ నాయుడిని కోరారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ బీఆర్ నాయుడు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పెద్దపులి అడుగులు

బోదాపురం శివారులో పెద్దపులి సంచారం!

- అడుగులను పరిశీలించిన అటవీశాఖ అధికారులు

వెంకటాపురం(నూగూరు), డిసెంబర్ 10: ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో పెద్దపులి సంచారం కలకలం రేపుతున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి అలుబాక, బోదాపురం శివారులోని గోదావరి లంకల్లో పుచ్చతోట వద్ద పెద్దపులి గాండ్రింపులు వినిపించడంతో తోటల వద్ద కాపలాకు వెళ్లిన రైతులు భయాందోళనకు గురయ్యారు. మంగళవారం ఉదయం రైతులు ఆ ప్రాంతంలో పరిశీలించగా పులి సంచరించినట్టు ఆనవాళ్లు కనిపించాయి. అటవీశాఖ అధికారులు గోదావరి పెద్దలంక వద్ద పులి సంచరించిన ప్రాంతానికి వెళ్లి అడుగులను పరిశీలించారు.

వెయ్యేండ్ల సంస్కృతి విచ్ఛిన్నమా?

అట్లా చేస్తానంటే ఎవరూరుకుంటరు? • ఓవైపు హననం.. మరోవైపు ఉత్సవమా?: సిధారెడ్డి

- కోటి రూపాయలు ముఖ్యం కాదు కోట్లాది ప్రజల గుండెల తల్లి ముఖ్యం
- అందుకే పురస్కారాన్ని తిరస్కరించిన
- తెలంగాణ తల్లిని మార్చడమంటే మన ప్రతీకలను అవమానించడమే
- గ్రామీణ మహిళ చెయ్యి ఖాళీగా ఉండదు
- చేతిలో పనిముట్టు తప్పక ఉంటుంది
- అప్పులు అంటూనే దుబారా ఖర్చు
- ఆరు గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇవన్నీ చేస్తున్నరు
- సమస్య కానిదాన్ని సమస్య చేస్తున్నరు
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ప్రముఖకవి నందిని సిధారెడ్డి

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): 'కోటి రూపాయలు ముఖ్యం కాదు. కోట్లాది ప్రజల గుండెల తల్లి ముఖ్యం. అందుకే ప్రభుత్వ పురస్కారాన్ని తిరస్కరించిన' అని ప్రముఖకవి, రచయిత నందిని సిధారెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లిని మార్చటం అంటే తెలంగాణ ప్రతీకలను మార్చటమేనని, శిల్పుల గిరాకీ కోసం చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దురదృష్టవశాత్తు అదే శిల్పులు 'నాడు కేసీఆర్ ప్రభుత్వంతో ఖర్చుపెట్టించారు..ఈనాడు ఈ ప్రభుత్వంతో ఖర్చుపెట్టిస్తున్నారు' అని వాపోయారు. తెలంగాణ సాంస్కృతిక సోయిలేనివాళ్లే వెయ్యేండ్ల బతుకమ్మను లేకుండా చేశారని మంగళవారం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తేల్చిచెప్పారు.

మీ సాహితీసేవ, తెలంగాణ ఉద్యమంలో మీ పాత్రను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మిమ్మల్ని సత్కరిస్తామంటే తిరస్కరించారని ప్రచారం జరుగుతున్నది.. నిజమేనా?

నిజమే. ప్రభుత్వం నుంచి ఒక అధికారి ఫోన్ చేశారు. మిమ్మల్ని ప్రభుత్వం గౌరవించాలని అనుకుంటున్నది.. పెద్ద మొత్తంలో క్యాష్ తోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తారని ఆ అధికారి చెప్పారు. వారితో నేనొకటే చెప్పాను. ఓవైపు తెలంగాణ అస్తిత్వం, సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తూ మరోవైపు ఈ సత్కారాలెందుకు అని చెప్పి తిరస్కరించాను.

బహుశా మీకు పెద్ద మొత్తం అంటే కోటి రూపాయలు అని తెలియకపోవచ్చు?

కోటి కాదు అంతకన్నా ఎక్కువైనా సరే.. కొట్లాది ప్రజల గుండెల్లో కొలువైన తెలంగాణ తల్లిని, ఆ తల్లిచేతిలో బతుకమ్మను తీసేసి గౌరవిస్తామంటే ఎట్లా అంగీకరించాలని నాతో మాట్లాడిన అధికారితో స్పష్టంగా చెప్పిన.

ప్రభుత్వం ఎందుకిలా చేసిందనుకుంటున్నారు?

ప్రజల దృష్టిని మరల్చేందుకే ఇవన్నీ చేస్తున్నట్టు స్పష్టమవుతున్నది. ఆరు గ్యారెంటీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నది. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం గ్యారెంటీ మాత్రమే అమలవుతున్నది. ఇంకా రైతు రుణమాఫీ, రైతుబంధు, దివ్యాంగులు, వృద్ధులకు ఇచ్చే పింఛన్లేవీ అమలు కావటం లేదనేది సత్యం. అది వారికీ తెలుసు. అప్పులు అప్పులు అంటూనే ఇంత ఖర్చుతో ఈ ఉత్సవాలే మిటి? తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చటం అంటే చర్చ అంతా గ్యారెంటీలను వదిలేసి ఉత్సవం వైపు మళ్లాలనే ఆలోచన ఉన్నట్టు కనిపిస్తున్నది. సమస్యలు కానివాటిని సమస్యలుగా చేసి వాటిమీదికి దృష్టి మరల్చాలనే ఆలోచన వీళ్లకు ఉన్నదని నేను భావిస్తున్న.

ప్రస్తుతం ఉన్న తెలంగాణతల్లి కవిత రూపంలో ఉన్నదని ఆరోపిస్తున్నారు? దీనికి మీ సమాధానం?

బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక ప్రతీక. ప్రపంచంలో ఈ ప్రాంతానికి లేని విశిష్ట సాంస్కృతిక ధార ఉన్నది. ప్రజల జీవన విధానం ఉన్నది. దీన్ని తొలగించి ఒక పార్టీ చిహ్నాన్ని పెట్టడం రాజకీయం కాక మరేమవుతుంది? కవిత రాకముందు వెయ్యి సంవత్సరాలకు పూర్వమే బతుకమ్మ ఉన్నది. బతుకమ్మను ఉద్యమవ్యాప్తిలో భాగంగా, సంస్కృతి వికాస కోణంలో వివిధ రూపాల్లో కవిత విస్తృత పరిచింది. అంత మాత్రంచేత ఇప్పుడున్న తెలంగాణ తల్లిని కవితకు ఆపాదిస్తూ నిరాకరించటం సరైంది కాదు. సీఎం భావించినా ఆయన చుట్టూ ఉండేవాళ్లు, సాహిత్యకారులు, కళాబృందాలు ఇలా ఎవరు మాట్లాడినా వాళ్లు వాళ్ల అవసరాల కోసం మాట్లాడుతున్నారని భావించాలి. బతుకమ్మ పాటలు, పండుగలు, చెరువులు, వ్యవసాయం, సంస్కృతిక వికాసం, కాకతీయుల కాలం నుంచే ఉన్నదని, జానపదులు అంతకన్నా పూర్వమే ఉన్నదని చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డల సంస్కృతిని ఒక పార్టీకి అప్పచెప్పటం, ఆపాదించటం చేస్తే ఒప్పుకోను.

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లాంటివాళ్లు కూడా స్వాగతిస్తుంటే మీరు ఇలా?

కూనంనేని సాంబశివరావు ఒక ఎమ్మెల్యే. చరిత్ర మీద అవగాహన, భావజాలానికి సంబంధించిన నాయకుడు మాట్లాడుతూ 'అప్పుడు కేసీఆర్ ఏ పార్టీని పిలవలేదు. మమ్మల్ని కూడా పిలవలేదు' అన్నారు. వారొక విషయం గుర్తుంచుకోవాలి. కేసీఆర్ ప్రభుత్వాధినేతగా ఉన్నప్పుడో.. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడో రూపొందించిన విగ్రహం కాదది. ఆ విగ్రహం రూపకల్పన 2006- 07లో జరిగింది. 18 ఏండ్లుగా తెలంగాణ తల్లిని విగ్రహరూపంలో ప్రతి తెలంగాణ బిడ్డ ఆరాధించుకున్నరు.

గత ప్రభుత్వం తెలంగాణ తల్లికి రూపం ఇవ్వలేదని ఈ సర్కార్ అంటున్నది కదా?

ఎన్నికలప్పుడు ఇచ్చిన గ్యారెంటీల్లో సాంస్కృతిక ప్రతీకలను మారుస్తామని చెప్పిండ్రా? ప్రకటించకుండా పనులు చేస్తున్నారంటే ఆరు గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కదా! ప్రతి ప్రభుత్వం మారినప్పుడల్లా తెలంగాణ ప్రతీకలు మారుస్తారా? తెలంగాణతల్లి విగ్రహాన్ని మార్చాల్సిన అవసరం లేదు. గాంధీ విగ్రహం, అంబేద్కర్ ఎట్లా మారదో అట్లనే ఒక తల్లి విగ్రహాన్ని కూడా మార్చాల్సిన అవసరం లేదు. తెలంగాణ తల్లి విగ్రహం ఒక ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఏర్పాటు చేసిన రాజకీయ విగ్రహం కాదు. అది తెలంగాణ ఉద్యమం. ఉద్యమావసరాల కోసం రూపొందించుకున్న తల్లి. చారిత్రక సందర్భంలో ఏర్పాటు చేసుకున్న రూపమది. ఆ భావన ఎట్లా వచ్చింది? తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలంతా ఉద్యమం చేస్తున్నప్పుడు తెలుగుతల్లి ముక్కలు అయిపోతుందని మాట్లాడుతున్న సందర్భంలో దానికి ప్రతిగా, జవాబుగా తెలంగాణతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. తల్లి భావన అనేది చైతన్యం పెంచేందుకు వచ్చింది. ఆ మాతృత్వభావన నుంచే భారతమాత, తమిళమాత, ఆంధ్రామాత అనే భావనలు. తెలుగు ప్రజల్లో సమైక్యభావనను కల్పించేందుకు తెలుగుతల్లి. తెలంగాణ సాంస్కృతిక ప్రతీకగా తెలంగాణ తల్లి పుట్టింది. ప్రభుత్వం మారినప్పుడల్లా రూపంలో మార్పులు చేయడం, ప్రతీకల్లో మార్పు తేవడం, ఆ విగ్రహాలు కాదని, మరో విగ్రహం పెట్టడం అంటే విచ్ఛిన్న సంస్కృతి. పార్టీల మధ్య విద్వేషం ఉంటే ఉంచుకోండి.. కానీ, సంస్కృతి మీద విద్వేషం ఉండాల్సిన పనిలేదు.

తెలంగాణ గ్రామీణ స్త్రీని మాతృమూర్తిగా కొలిచే రీతిలో కొత్త విగ్రహ రూపు ఉన్నదని శిల్పులు కూడా వివరణ ఇచ్చారు కదా?

శిల్పులకు గిరాకీ కావాలె. తమ గిరాకీ కోసం చరిత్రను మారిస్తే ఎలా? ఇదే శిల్పి నిన్నటిదాకా అమరధామం (అమరవీరుల స్మృతి చిహ్నం) చేశారు. ఆ పేరుతో ఆ ప్రభుత్వాన్ని ఖర్చుపెట్టించారు. ఇప్పుడు తెలంగాణ తల్లిపేరుతో ఖర్చు. ఆ ఖర్చులో మిగుల్చుకోవటం తప్ప ఇందులో ఆ శిల్పులకు తెలంగాణ సోయి ఎక్కడున్నది? శిల్పులను, కవులను ఈ ప్రభుత్వం సరిగ్గా అర్థం చేసుకోవాలె. తెలంగాణ చైతన్యాన్ని, అస్తిత్వాన్ని నిరంతరం కాపాడుకునే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తే మంచిది. ఏ గ్రామీణ మహిళ ఆ విగ్రహంలో ఉన్నట్టు నేను చూడలేదు. నాదీ పల్లెటూరే. వేల పల్లెలు తిరిగిన.. లక్షల మంది గ్రామీణ తల్లులను చూసిన. గ్రామీణ మహిళ చేతిలో పనిముట్టు ఉంటది. కలుపు కోతలప్పుడు కొడవలి, ఇతర పనులు చేస్తే పలుగూపార, ఒకవేళ పశువుల దగ్గర ఉన్న మహిళ అయితే ఆమె చేతిలో కర్ర, ఆఖరికి ఇంటిపనులు చేస్తే చీపురుకట్ట, బిడ్డకు అన్నం తినిపించే తల్లి.. ఇలా అనేక రూపాల్లో తల్లులను చూసిన. కానీ, తీరిగ్గా అంత హాయిగా అభయహస్తం భరోసా పెట్టినట్టు ఉండే మహిళా మూర్తిని నేను ఎక్కడా చూడలేదు. అంతెందుకు ఒకవేళ దీవించే ఏ తల్లి అయినా తన చేయిని అలా పెట్టదు. తల్లి భావన ఆరాధనీయమైనది. దేవతలు ఉన్నారో లేదో తెలియదు కానీ, వారిపట్ల నమ్మిక, విశ్వాసం ప్రజల్లో ఉన్నది. తెలంగాణ తల్లిభావన ఉద్యమ చైతన్యాన్ని చూడవలసిన పద్ధతిలో చూడాలి. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మను తొలగించి అభయహస్తం పెట్టారు. ఆ చేయి ఎవరిది? గ్రామీణ మహిళ అని చెప్తూ ఎవరిని మోసం చేద్దామని? ఈ ప్రభుత్వానికి తెలంగాణ సోయిలేదని, తెలంగాణ ఉద్యమం పట్ల, తెలంగాణ అమరుల పట్ల గౌరవం లేదని స్పష్టంగా తెలిసిపోతున్నది. తెలంగాణ తల్లి విగ్రహంపై ఎవరికి తోచింది వారు చెప్తున్నరు. ఇప్పుడున్న బతుకమ్మలో ఉన్నది తెలంగాణకు గర్వకారణమైన నేత చీర, అదీ పోచంపల్లి చీర.. ఆ సంస్కృతిని అవమానిస్తరా?

ప్రజాపాలన విజయోత్సవాలు అని ప్రభుత్వం చెప్తుంటే మీరు దుబారా అంటున్నారు?

దుబారా కాక మరేమిటి? ఎన్నికల ప్పుడు ఆరు లిఖిత గ్యారెంటీలకు తోడు మౌఖికంగా ఏడో గ్యారెంటీ కూడా ఇచ్చారు. ప్రశాంతతను అమలు చేస్తామని చెప్పారు. దాన్ని ఏడో గ్యారెంటీ అన్నరు. ప్రజాస్వామిక వాతావరణాన్ని ఎక్కడ నెలకొల్పారు? ములుగులో ఎన్‌కౌంటర్ ఎందుకు జరిగింది? ఏడుగురు అజ్ఞాతనక్సలైట్లకు అన్నంలో విషంపెట్టి చంపించారని అంటున్నరు. విషం పెట్టి చంపినా, తూటాలతో చంపినా చంపుడు చంపుడే కదా? ఆ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా వాళ్లు బంద్‌కు పిలుపు ఇచ్చిండ్రు. ఆ బందు పిలుపునాడే ఉత్సవం జరుపుకొన్నరు. అంటే ఓవైపు హననకాండ మరోవైపు ఉత్సవకాండనా? గత ప్రభుత్వం పరిష్కరించని పనులను ఈ ప్రభుత్వం పరిష్కరిస్తే మంచిపేరు వస్తది. లేకుంటే చెడ్డపేరు వస్తది. నిరసన వెల్లువెత్తుతది. కవులు, కళాకారులు, రచయితలు ప్రజల్లో అవసరమైతే ఈ ప్రభుత్వాన్ని దించే చైతన్యం కూడా వస్తది. ఈ ప్రభుత్వం తెలంగాణ సోయితో, తెలంగాణ అస్తిత్వ చైతన్యంతో, గత చరిత్రపై గౌరవభావంతో ఉండాలి.

తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు ఏం చేస్తారు?

తెలంగాణ అస్తిత్వాన్ని నిర్మించేదే సాహిత్యకారులు! నిర్మించిందే సాంస్కృతిక ఉద్యమం! ఈ సాంస్కృతిక ధార లేకపోయి ఉంటే ఒక రాజకీయ పార్టీ ఇన్ని రోజులు ఉండేది కాదు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారినప్పుడు ప్రశ్నించింది తెలంగాణ కవులు, రచయితలు అన్న విషయాన్ని ఎవరూ విస్మరించకూడదు. తెలంగాణ సమాజం నిర్మించుకున్న ప్రతీకలను మార్చినా, అస్తిత్వాన్ని తొలగించినా సహించేది లేదు. కొన్ని వందల సంవత్సరాలుగా తెలంగాణ సంస్కృతిని నిర్మించుకుంటూ వచ్చిన కవులు, కళాకారులు ప్రశ్నించకుండా ఉండలేరు. అస్తిత్వాన్ని నిర్మూలించే, నిర్వీర్యం చేసే భావనను కవులు, కళాకారులు ఎప్పుడూ ఒప్పుకోరు. నిజమైన తెలంగాణ ప్రేమికులు అస్తిత్వాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తరు.

ఇంకెందరు పిల్లలు బలి కావాలి?

- విగ్రహాలపై ఉన్న ధ్యాస విద్యార్థులపై ఏదీ?
- మహబూబ్‌నగర్‌లో వరుస ఫుడ్ పాయిజన్లు
- సీఎం సొంత జిల్లాలోనే ఇలా ఉంటే రాష్ట్రం పరిస్థితేంటి?
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): విగ్రహాలను మార్చడం మీద ఉన్న ధ్యాస సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థుల మీద ఎందుకు లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రంతో పాటు సొంత జిల్లాలోని గురుకులాలు, పాఠశాలలను పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి అని మంగళవారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్లతో విద్యార్థులు దవాఖానల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నదని నిలదీశారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌తో 15 మంది విద్యార్థులు దవాఖాన పాలైన దుస్థితి నెలకొన్నదని, సీఎం సొంత జిల్లాలోనే ఇలా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఇంకెన్ని దారుణ పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని విమర్శించారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని ఎద్దేవా చేశారు. మాటలే తప్ప చేతలు లేని సీఎం తీరు వల్ల ఇంకెంత మంది విద్యార్థులు దవాఖాన పాలు కావాలి?, ఎంతమంది ప్రాణాలు కోల్పోవాలి? అని ప్రశ్నించారు.

'మోత్కూర్' ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్

- చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూర్ ప్రభుత్వ పాఠశాల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయింది. తక్షణమే ఘటనపై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. గత నెల 29న ముక్కిపోయిన, పురుగు పట్టిన బియ్యంతో వండిన అన్నం తినలేక 300 మంది విద్యార్థులు పస్తులున్న విషయం విదితమే. ఈ విషయం మీడియాలో ప్రచారం కాగా, కొన్ని చానళ్ల ద్వారా 'ఇదంతా ప్రతిపక్షాల కుట్ర' అంటూ ప్రభుత్వం దాటవేస్తున్న క్రమంలో.. ప్రముఖ న్యాయవాది ఇమ్మానేని రామారావు జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎన్‌హెచ్‌ఆర్సీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. అనంతరం సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలిచ్చింది.

అంగన్వాడీలకు 'ఆయిల్‌ఫెడ్' నుంచే సరుకులు

- ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించం
- మహిళా, శిశు సంక్షేమ శాఖ వివరణ

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): అంగన్వాడీ కేంద్రాలకు ఆయిల్‌ఫెడ్ ద్వారానే సరుకులు పంపిణీ చేస్తున్నామని మహిళా, శిశు సంక్షేమ శాఖ తెలిపింది. 'అంగన్వాడీ కేంద్రాలకు ఆయిల్‌ఫెడ్ సరుకులు బంద్' పేరుతో సోమవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. సరుకులు నాణ్యంగా రావడంలేదన్న ఫిర్యాదులు వచ్చిన మాట నిజమేనని శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తులు సరఫరా చేయాలని టీచర్లు, వర్కర్ల యూనియన్ నుంచి ఇటీవల వినతులు అందాయని చెప్పారు. ఈ విషయాన్ని తాము టీజీ ఆయిల్‌ఫెడ్ దృష్టికి తీసుకెళ్లగా తగిన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. సరుకుల పంపిణీ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించలేదని స్పష్టం చేశారు. పంపిణీ చేయలేమని ఆయిల్‌ఫెడ్ ఎండీ నుంచి సైతం ఎలాంటి వినతి రాలేదని చెప్పారు.

2వేల కోసం లోన్ యాప్ వేధింపులు..

- యువకుడి ఆత్మహత్య

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): లోన్ యాప్ వేధింపులకు యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన విశాఖపట్నంలో చోటుచేసుకున్నది. అంగడి దిబ్బకు చెందిన నరేంద్ర(21)కు 40రోజుల క్రితం పెండ్లయ్యింది. వ్యక్తిగత అవసరాల కోసం నరేంద్ర ఓ ప్రైవేట్ యాప్‌లో లోన్ తీసుకొని, తిరిగి అప్పు చెల్లించాడు. అయితే, మరో రూ.2వేలు చెల్లించాలని లోన్ యాప్ సిబ్బంది నరేంద్రను వేధించారు. త్వరలోనే చెల్లిస్తామన్నా.. వినకుండా నరేంద్ర భార్య ఫొటోలను మార్ఫింగ్ చేసి బంధువులకు పంపించారు. తన పరువు పోయిందని మనస్థాపానికి గురైన నరేంద్ర.. మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు.

మళ్లీ ఫుడ్ పాయిజన్

మొదటిపేజీ తరువాయి...

గిరిజన ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న సుమారు 180 మంది విద్యార్థినులు ఉన్నారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు పాఠశాలలో అల్పాహారం కింద కిచిడీ తిన్నారు. 9.30 గంటల ప్రాంతంలో ఎనిమిదో తరగతి చదువుతున్న పలువురు విద్యార్థినులు ఒక్కసారిగా కడుపు నొప్పి అంటూ రోదించడం మొదలుపెట్టారు. వెంటనే వారిని ప్రభుత్వ దవాఖానకు తరలించి, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దవాఖానలో చేరిన ఎనిమిదో తరగతి విద్యార్థినులు గీత, గూలిబాయి, శైలజ, శ్రావణికి వైద్యులు చికిత్స అందించారు. ఫుడ్ పాయిజన్ కారణంగానే వారికి కడుపునొప్పి వచ్చినట్టుగా వైద్యులు వెల్లడించారు. సెలైన్ ఎక్కించిన తర్వాత విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి కుదుటపడటంతో డిశ్చార్జి చేశారు. వాస్తవానికి గుట్టుచప్పుడు కాకుండా వైద్యం చేయించేందుకు ప్రయత్నించగా.. అప్పటికే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో విషయం బయటికి పొక్కింది. ఘటనా స్థలానికి ప్రభుత్వ సిబ్బందితోపాటు మీడియా వెళ్లడంతో హాస్టల్‌లో ప్రభుత్వ నిర్లక్ష్యం బయటపడింది. బాధిత విద్యార్థినులను విద్యార్థి సంఘాల నేతలు, బీఆర్ఎస్ ప్రతినిధులు దవాఖానలో పరామర్శించారు. ఘటనకు కారణమైన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగినప్పుడు కాంగ్రెస్ నేతలు, అధికారులు హడావుడి చేస్తున్నారని విమర్శించారు.

దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

వారం రోజులుగా పురుగులే...

పాఠశాలలో వారం రోజులుగా తిండి సరిగా ఉండటం లేదని కడుపునొప్పితో బాధపడిన విద్యార్థిని గూలిబాయి 'నమస్తే తెలంగాణ'తో తెలిపింది. అన్నంలో పురుగులు వస్తున్నాయని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేసింది.

భోజనం సరిగా పెట్టడం లేదు

కొన్ని రోజులుగా కుళ్లిన కూరగాయలతోనే వంట చేస్తున్నారు. వార్డెన్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఇచ్చిందే మేం పెడుతున్నమని చెబుతున్నది. మా అమ్మానాన్నలు వచ్చినా లోపలికి అనుమతించరు. గతంలో చాలా బాగా ఉండేది. ఇప్పుడు నరకంగా ఉన్నది.

- సింధుబాయి, విద్యార్థిని

పురుగులన్నమే దిక్కు

మాకు పురుగుల అన్నమే పెడుతున్నారు. తిండిపదార్థాలు వాసన వస్తున్నాయి. అవి తినటంతోనే మాకు ఇలా జరిగింది. ఈ హాస్టళ్లో ఉండాలంటే భయమైతున్నది. బాగోలేని ఆహారం పెడుతున్నరు. నీళ్లు కూడా సరిగా లేవు.

- అంగూరిబాయి, విద్యార్థిని

నొప్పి భరించలేం..

కలుషిత ఆహారం పెట్టడంతోనే అస్వస్థతకు గురయ్యాను. భరించలేని నొప్పులు ఉన్నాయి. ఒక్క నిమిషం కూడా ఇక్కడ ఉండాలనిపిస్తలేదు. మాజీ సీఎం కేసీఆర్ ఉన్నప్పుడు బాగుండేది.

- శైలు, విద్యార్థిని

కారకులను శిక్షించాలి

మాకు సరైన సౌకర్యం, స్థోమత లేకనే నా బిడ్డను హాస్టల్‌లో చదివిస్తున్నాం. కానీ, ఇక్కడ మా బిడ్డలు నరకం అనుభవిస్తరని కలలో కూడా అనుకోలేం. తిండే సరిగా పెట్టకపోవడం ఏంటి? ఈ తప్పు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి.

- అనూషబాయి, విద్యార్థిని తల్లి

హాస్టళ్లు నరకానికి ఆనవాళ్లు

రాష్ట్రంలో వసతిగృహాలు నరకానికి ఆనవాళ్లుగా మారాయి. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నా సీఎం స్పందించకపోవడం విడ్డూరం. హాస్టళ్లో చావుడప్పులు మోగుతుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటు.

- శుభప్రద్‌పటేల్, రాష్ట్ర జీసీ కమిషన్ మాజీ సభ్యుడు

మంథనికి శ్రీధర్‌బాబు ఒరగబెట్టిందేమీ లేదు

- కేసీఆర్ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్
- శ్రీధర్‌బాబు ఏడాది వైఫల్యాలపై చార్జిషీట్

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో మంత్రి శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమీ లేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మండిపడ్డారు. నలభై ఏండ్ల నుంచి ఆయన కుటుంబానికి చెందినవారే ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా, మంత్రిగా కీలక పదవులు అనుభవిస్తున్న శ్రీధర్‌బాబు నియోజకవర్గ ప్రజలను పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీధర్‌బాబు వైఫల్యాలపై మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో చార్జిషీట్ విడుదల చేశారు. అనంతరం మధుకర్ మాట్లాడుతూ.. ఏడాదిలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తామని ఎన్నికల సమయంలో ప్రగల్భాలు పలికిన శ్రీధర్‌బాబు ఇప్పటివరకు కనీసం తట్టెడు మట్టికూడా తీయలేదని ధ్వజమెత్తారు. పరిశ్రమలు పెట్టి ఉద్యోగాలు కల్పిస్తానని, మంథని నుంచి రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు రోడ్లు నిర్మిస్తానని, మెడికల్ కాలేజీ నిర్మిస్తానని నమ్మబలికి ఓట్లేయించుకున్న ఆయన ఇప్పుడు ప్రజలను నిండా ముంచుతున్నారని నిప్పులు చెరిగారు. మంథనిలో విద్యా సౌకర్యాలపై ఒక్కసారి కూడా సమీక్షించకపోవడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని దుయ్యబట్టారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓడేడు బ్రిడ్జి నిర్వాసితులను రెచ్చగొట్టిన శ్రీధర్‌బాబు ఇప్పుడు వారికి ఒరగబెట్టిందేమిటని ప్రశ్నించారు. మంథనిలోని పోలీస్ స్టేషన్లను కాంగ్రెస్ కార్యాలయాలుగా మార్చి మాఫియా రాజ్యం నడిపిస్తున్నారని నిప్పులు చెరిగారు. కేసీఆర్